క్లుప్తంగా

పేకాట స్థావరంపై దాడి

వాంకిడి: మండలంలోని బంబార గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించి 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

తిరుగువారం బోనాలు


బోనాలు వండి భోజనాలు చేస్తున్న భక్తులు

దహెగాం: మండల కేంద్రం సమీపంలోని మలన్న ఒర్రె వద్ద కొలువుదీరిన రావుల మల్లన్న ఆలయం వద్ద ఆదివారం తిరుగువారం బోనాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం, వివిధ గ్రామాల నుంచి భక్తులు వచ్చి అక్కడే బోనం నైవేద్యంతో మొక్కులు చెల్లించారు. భక్తులు సంహపంక్తి భోజనాలు చేశారు. గత ఆదివారం బోనాల పండుగ ఉండగా వారం తరువాత తిరుగువారం బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని భక్తులు పేర్కొన్నారు.

నూతన ఎస్సైకి సన్మానం


ఎస్సై ప్రవీణ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బెజ్జూర్: బెజ్జూర్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కట్టే ప్రవీణ్‌ను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం మండల కేంద్రంలో శాలువాతో సన్మానించి మిఠాయిలు తినిపించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాశ్, మాజీ సర్పంచ్ దుబ్బుల నన్నయ్య, శైలేష్ చారి, సత్తయ్య, బాబురావు, యాద సంతోష్, మిర్యాల మనీష్, రాచకొండ ఆదర్శ, మాహెర్ అలీ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కట్టే ప్రవీణ్‌ను సిర్పూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అనుచరులు ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి 'ఉపాధిహామీ' తనిఖీలు

వాంకిడి: మండలంలో నేటి నుంచి ఉపాధిహామీ పనులపై తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. 2023 –24 ఆర్థిక సంవత్సరంలో మండలవ్యాప్తంగా జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఆడిట్ నిర్వహిస్తారని, గ్రామసభల అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్‌డీవో సమక్షంలో డిసెంబర్ 3వ తేదిన ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

'మద్యం తాగి వాహనాలు నడపొద్దు'


డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న పోలీసులు

కౌటాల: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. ఆదివారం సాయంత్రం కౌటాల మినీ స్టేడియం సమీపంలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. పోలీసులు ఉన్నారు.

బెజ్జూర్: వాహనదారులు నిబంధనలను పాటించాలని ఎస్సై కె.ప్రవీణ్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో కరాటే మాస్టర్ కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: డ్రాగన్ కుంఫూ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఈఎస్‌ఐ ఆసుపత్రి హనుమాన్ దేవాలయం ఆవరణలో నిర్వహించిన కరాటే బెల్ట్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పట్టణా నికి చెందిన కృష్ణవేణి పాఠశాలకు చెందిన సువర్ణలత, ఎం.రఘురాం, వీవీపీ పాఠశాలకు చెందిన అద్విత‌లు ఎల్లో బెల్ట్ సాధించారని జిల్లా డ్రాగన్ కుంఫూ ప్రధాన కార్యదర్శి, కరాటే మాస్టర్ చాపిడి కుమార్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

బాబోయ్ కోతులు!

- ఇళ్లలోకి చొరబడుతున్న వానరాలు
- భయాందోళనలో స్థానికులు
- నియంత్రణలో అధికారులు విఫలం


జిల్లాకేంద్రంలోని ఓ ఇంట్లో కోతుల గుంపు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో కోతుల బెడద రోజురోజుకు పెరుగుతోంది. కోతులు గుంపులుగా కాలనీల్లో తిరుగుతూ విరుచుకుపడుతున్నాయి. ఇళ్లలో, దుకాణాల్లోకి చొరబడి తినుబండారాలు, ఇతర వస్తువులు ఎత్తుకెళ్లడంతో పాటు పండ్ల చెట్లను, పూల మొక్కలను, వాటర్ ట్యాంకుల పైప్‌లైన్‌లను ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలపై దాడులకు దిగుతూ గాయపరుస్తున్నాయి. కోతుల భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కోతుల నియంత్రణ కోసం అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల తిప్పలు..

అడవిలో ఉండాల్సిన కోతులు ఊళ్ల మీద పడుతున్నాయి. అటవీ ప్రాంతాలు రోజురోజుకూ తగ్గిపోవడం, అడవిలో ఆహారం లభించకపోవడంతో గ్రామాల్లో తిరుగుతున్నాయి. కోతులు ఇళ్లల్లోకి చొరబడి భోజనంతో పాటు పప్పుదినుసులు, ఇతర విలువైన సామగ్రి పట్టుకెళ్తున్నాయి. కోతులతో కిరాణాషాపు, పండ్ల దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాపులోని వస్తువులకు రక్షణగా జాలీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కోతుల బెడదతో పెంకుటిళ్లు ధ్వంసమవుతున్నాయి. ఇళ్లలో ఉన్న మామిడి, జామ, బొప్పాయి ఇతర పండ్ల చెట్లు, కూరగాయల చెట్లను సైతం వదలకుండా ధ్వంసం చేస్తున్నాయి.

భయాందోళనలో ప్రజలు..

కోతుల బెడద ఎక్కువ కావడంతో పట్టణ వాసులు బయాందోళనకు గురవుతున్నారు. కోతులను తరిమే ప్రయత్నంలో అవి ప్రజలపై దాడులు చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కోతి కాటుకు గురై ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. మిద్దెల మీద గుంపులుగా చేరి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతుల బెడద తీవ్రం కావడంతో కొంత మంది టపాసులు, పెద్ద శబ్దాలు చేసి వాటిని తరిమే ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చర్యలకు డిమాండ్..

జిల్లా కేంద్రంలో కోతుల నియంత్రణ కోసం అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కోతులను బంధించి అటవీప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. వాటి నియంత్రణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించి కోతుల బారి నుంచి రక్షణ కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

ప్రమాదాల బారిన పడుతున్నాం



పదుల సంఖ్యలో కోతులు ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఇటీవల ఇంట్లో పనులు చేసుకుంటున్న సమయంలో ఒక్కసారిగా కోతులు మీదకు రావడంతో కిందపడ్డాను. దీంతో తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రస్తుతం చంద్రపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాను. ఇప్పటికే రూ.20వేల వరకు ఖర్చయ్యింది. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి. – దిల్లీ సంధ్య, గృహిణి

నియంత్రణ చర్యలు చేపట్టాలి



జిల్లా కేంద్రంలో వందల సంఖ్యలో కోతులు వీరంగం సృష్టిస్తున్నాయి. వాటిని సంబంధిత అధికారులు నియంత్రించాలి. ఇటీవల నా దుకాణంలోని వస్తువులను చిందరవందరగా చేసి తీవ్రంగా నష్టపరిచాయి. ప్రతీరోజు ఎక్కడో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయి. పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు కోతులను కట్టడి చేయాలి. – సత్యనారాయణ, వ్యాపారి

దుర్గామాత ఆలయంలో భక్తుల పూజలు


మహంకాళి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కౌటాల, బెజ్జూర్ తదితర ప్రాంతాలతో పాటు పక్క జిల్లాలోని బెల్లంపల్లి, మంచిర్యాల, గోదావరిఖని, లక్సెట్టిపేట్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. భక్తులు తలనీలాలు సమర్పించి మేకలు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించి అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

'ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం'


సమావేశంలో మాట్లాడుతున్న అంజనేయులుగౌడ్

రెబ్బెన: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. ఆదివారం గోలేటి టౌన్‌షిప్‌లోని బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో గ్యారెంటీల పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ప్రజా తిరుగుబాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం గురికాక తప్పదన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరగలేని పరిస్థితులు ఏర్పడుతాయని పేర్కొన్నారు. మహారాష్ట్ర ఎన్నికలో కాంగ్రెస్‌కు పట్టిన గతే తెలంగాణలోనూ పడుతుందని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇవ్వనున్నారని తెలిపారు. నాయకులు సతీశ్, సుదర్శన్‌గౌడ్, ప్రసాద్, వసంత్‌రావు పాల్గొన్నారు.

చదరంగంతో మానసిక ప్రశాంతత


బహుమతులు అందజేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: చదరంగం ఆటతో మానసిక ప్రశాంతత ఉంటుందని డీఎస్‌వో మీనారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆదర్శ క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి చెస్ పోటీలను చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కనకయ్య, సంపత్, జిల్లా ఉపాధ్యక్షుడు ఉపేందర్, ఏసీఎంవో ఉద్ధవ్, టోర్నమెంట్ కన్వీనర్ రవీందర్, తిరుపతి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న రావి శ్రీనివాస్

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి గ్రామంలో ఆదివారం సిర్పూర్(టి) నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, మాజీ జెడ్పీటీసీ అజ్మీరా రాంనాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శంకర్, సమీర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు ఫైసల్ బిన్ సులేమాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్ష శిబిరం


కంటి పరీక్షలను పరిశీలిస్తున్న విశ్వప్రసాద్

వాంకిడి: మండలంలోని కనర్‌గాం గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో ఆదివారం కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మండల అధ్యక్షుడు గుర్నెలె నారాయణతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కంటిచూపు సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. వృద్ధులకు తమ కార్యకర్తలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి సహకరిస్తారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దుర్గం జీవన్, నాయకులు మపాదె చరణ్, లింబారావు, మెంగాజీ, నారాయణ, సంతోష్, నాగభూషన్, జాడె సునీల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' పరీక్షలకు విద్యార్థులు



పరీక్షకు వెళ్లిన విద్యార్థులు

కౌటాల: 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన 'సాక్షి' స్పెల్ బీ, మ్యాథ్స్ బీ క్వార్టర్ ఫైనల్ పరీక్షకు కౌటాల నజారేత్ పాఠశాల విద్యార్థులు హాజరైనట్లు కౌటాల ప్రిన్సిపాల్ స్టీవెన్ సన్ తెలిపారు. ఈ నెల 4వ తేదీన స్థానిక పాఠశాలలో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను క్వార్టర్ ఫైనల్ పరీక్షకు సెలెక్ట్ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సాక్షి మీడియా కృషి చేస్తుందన్నారు. ఇలాంటి పోటీ పరీక్షలను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరగటంతో పాటు మరిన్ని పరీక్షలకు సిద్ధమయ్యే అవకాశం ఉందన్నారు. పాఠశాలకు చెందిన అభితేజ, అభిధ్య, అర్ష, హేమవంత్, తఋషులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. క్వార్టర్ ఫైనల్ పరీక్షకు అర్హత సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

అవార్డు అందుకున్న ఏఎస్సై ఉద్ధవ్

జైనూర్: పోలీసు శాఖలో నిజాయితీగా విధులు నిర్వహిస్తే ఉత్తమ ప్రశంసా అవార్డు పొందవచ్చని డీజీపీ జితేందర్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో డీజీపీ చేతుల మీదుగా జైనూర్ ఏఎస్సై ముండే ఉద్ధవ్ ప్రశంసా అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న ఏఎస్సై ముండే ఉద్ధవ్‌ను సీఐ రమేశ్, ఎస్సై సాగర్‌లు అభినందించారు.

'రంగుల' రహదారి



మంచిర్యాల –చంద్రపూర్ నాలుగు వరుసల జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు రంగురంగుల పూలమొక్కలు విరగబూసి కనువిందు చేస్తున్నాయి. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌లో రంగురంగుల పూలమొక్కలు నాటారు. కొన్ని రోజులుగా పూలు విరగబూయడంతో రోడ్డు వెంట ప్రయాణించే వాహనదారులు ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ప్రయాణాలు సాగిస్తున్నారు. – రెబ్బెన

వరి కొయ్యలు కాలిస్తే అనర్థాలు

- అవగాహన లేక వరి కొయ్యలకు నిప్పు
- కలియదున్నాలని అధికారుల సూచన


దహెగాం శివారులో కాలుతున్న వరి కొయ్యలు

దహెగాం: వరి పంటను రైతులు గతంలో కొడవళ్లతో మొదళ్ల వరకు కోసేవారు. పశువుల పెంపకంపై మక్కువ చూపిన రైతులు వరిగడ్డిని కుప్పలుగా పశుగ్రాసంకోసం నిల్వ చేసేవారు. కానీ ప్రస్తుతం పశువుల సంఖ్య తగ్గిపోవడంతో పాటు యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. హార్వేస్టింగ్ చేసే సమయంలో వరిని పైకి కోయడంతో కొయ్యలు పెద్దవిగా మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు కొంత గడ్డిని తీసుకెళ్తుండగా మిగిలిన గడ్డిని అక్కడే వదిలేస్తున్నారు. దుక్కి దున్నే సమయంలో కొయ్యలు ఇబ్బందిగా మారతాయని రైతులు వరి కొయ్యలకు నిప్పు పెడుతున్నారు. అవగాహన లేక రైతులు నిప్పు పెట్టడంతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వరి కొయ్యలను కలియ దున్నడం వల్ల పొలానికి ఎరువుగా మారుతాయని చెబుతున్నారు.

భవిష్యత్ పంటలకు నష్టం..

పొలంలో కొయ్యలను కాల్చడం అత్యంత ప్రమాదకరమని శాస్త్రవేత్తలు, సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు అవగాహనలేమితో పంటలకు ఎంతో మేలు చేసే కొయ్యలను భూమిలో కలియదున్నకుండా కాల్చివేసి భవిష్యత్ పంటలను నాశనం చేస్తున్నారని, వాతావరణాన్ని తీవ్రంగా కలుషితం చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. కొయ్యలను కాల్చివేసే సమయంలో భూమి గట్టిపడడం వల్ల పొలాన్ని కలియదున్నడం వీలు కాదు. అదే విధంగా భూమిలో ఉన్న సూక్ష్మజీవులు, వానపాములు నాశనమవుతున్నాయని దీంతో భూమి గుల్లగా మారే పరిస్థితి ఉందని, నాట్లు వేసిన సమయంలో వేర్లకు సరిగ్గా పోషకాలు చేరవని, పైరు ఎదగదని పేర్కొంటున్నారు.

కలియదున్నితేనే లాభం..

పంట కోసిన వెంటనే వరి కొయ్యలను కాల్చకుండా పొలంలోనే కలియ దున్నాలి. దీంతో కొయ్యలు మట్టితో కప్పబడి కుళ్లే ప్రక్రియ ప్రారంభమవుతుంది. తర్వాత సేంద్రియ ఎరువుగా మారుతుంది. రైతులకు అవగాహన లేక వరి కొయ్యలకు నిప్పు పెడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రజలకు అప్రమత్తత అవసరం

జైనూర్: పులి సంచారంతో పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్‌వో మజ్రోద్దీన్ అన్నారు. ఆదివారం మండలంలోని గౌరి గ్రామ ప్రజలతో సమావేశమై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతన్నలు ఉదయాన్నే పత్తితీతకు వెళ్లడం, ఒంటరిగా వెళ్లడం చేయకూడదన్నారు. ఉదయం 9, 10 గంటల ప్రాంతంలో గుంపులుగా వెళ్లి వ్యవసాయ పనులు చేపట్టాలన్నారు. తీసిన పత్తిని సా యంత్రం 5 గంటల లోపే జమ చేసుకొని గ్రామాలకు చేరుకోవాలన్నారు. అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

కంట్రోల్‌రూం ఏర్పాటు

జైనూర్: కులగణన కుటుంబ సర్వేలో ఎవరైన నమోదు చేసుకోకపోతే వారి కోసం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ బీర్షావ్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డిలు అన్నారు. కంట్రోల్ రూం నం. 89190 85386లో సంప్రదించాలన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారికి మరో అవకాశాన్ని కల్పించినట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. కార్యదర్శి, ఎంపీడీవో కార్యాలయంలో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

తప్పిదాలు లేకుండా డాటా ఎంట్రీ చేయాలి


జైత్‌పూర్‌లో ఓటరు నమోదు వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీవో లోకేశ్వర్‌రావు

వాంకిడి: సర్వే ఆన్‌లైన్ డాటా ఎంట్రీ వివరాల నమోదులో తప్పిదాలు లేకుండా చూడాలని ఆర్డీవో లోకేశ్వర్ రావు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. వీలైనంత త్వరగా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని, అవసరాన్ని బట్టి అదనంగా ఆపరేటర్లను తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం జైత్‌పూర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటరు నమోదు వివరాల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, అజీజుద్దిన్, తదితరులు ఉన్నారు.

అందిన వైద్యం.. నిలిచిన ప్రాణం


వానరానికి వైద్యం అందిస్తున్న పశువైద్య సిబ్బంది

రెబ్బెన: విద్యుత్‌షాక్‌కు గురై ప్రాణాపాయస్థితికి చేరిన వానరాన్ని రెబ్బెన అటవీశాఖ సిబ్బంది కాపాడారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో విద్యుత్‌షాక్ తగిలి స్తంభంపై నుంచి వానరం కింద పడింది. తీవ్రగాయాలు కాగా స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. డిప్యూటీ రేంజ్ అధికారి భానేష్ ఆదేశాల మేరకు అటవీశాఖ సిబ్బంది గాయాలపాలైన వానరాన్ని పశువైద్యశాలకు తరలించారు. సకాలంలో వైద్య సేవలు అందడంతో ప్రాణపాయం తప్పింది.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ఎన్నిక

చింతలమానెపల్లి: మండల ఆర్యవైశ్య సంఘం కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండలంలో కార్తికమాసం వనభోజనాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మండల సంఘం అధ్యక్షులుగా నూకల మోహన్, ప్రధాన కార్యదర్శిగా బండ ప్రకాశ్, కోశాధికారిగా ఎల్క సుదర్శన్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీకి సభ్యులు అభినందనలు తెలిపారు.

మహాధర్నా విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు, వృద్ధులకు ఇచ్చిన హామీ ని నిలబెట్టుకోవాలని ఈనెల 26వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కేశవ్‌రావ్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇస్లాంబిన్ హస్సన్, మూర్తి, మహేశ్, రాజయ్య, సంతోష్, మొండి, తదితరులు పాల్గొన్నారు.